జార్ఖండ్

# రష్యా సోషలిస్టు విప్లవ శతవార్షిక సభ

**రాంచి, 2017 ఏప్రిల్ 22, 23 తేదీలు :**

లెనిన్ జయంతి మరియు రష్యా సోషలిస్టు విప్లవ శతవార్షిక సందర్భాన్ని స్మరించుకుంటూ సిపిఐ(ఎం-ఎల్) జార్ఖండ్ రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో 2017 ఏప్రిల్ 22, 23 తేదీలలో రాంచిలో రెండు రోజుల కార్యక్రమం నిర్వహించారు. 'భారత కమ్యూనిస్టు ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్ళు' అనే అంశంపై తొలిరోజు చర్చ జరిగింది. కమ్యూనిస్టు సంస్థలుగా కృషిచేస్తున్నవారిని, కమ్యూనిజంలో విశ్వాసమున్నవారిని ఈ చర్చలలో భాగస్వాములు కావలసిందిగా ఆహ్వానించారు. సిపిఐ(ఎం), సిపిఐ(ఎం-ఎల్) లిబరేషన్, సిపిఐ(ఎం-ఎల్) ఎన్డి సంస్థల నుండి ఈ సమావేశాలకు హాజరవుతామని చెప్పారుకానీ, వారు తమ ప్రతినిధులెవరినీ ఈ సమావేశాలకు పంపలేదు. ఈ సమావేశాలకు హాజరైనవారంతా తమ తమ అవగాహనలను వ్యక్తం చేశారు. జార్ఖండ్ రాష్ట్ర సిపిఐ కార్యదర్శి కె.డి.సింగ్ మాట్లాడుతూ ఈ తరహా చర్చను నిర్వహించటాన్ని స్వాగతించారు. ఈ అంశం పార్లమెంటరీ చట్ర పరిధిలోనో లేదా సాయుధపోరాట పంథా చట్ర పరిధిలోనో చర్చించాలని కోరవలసి వుంటుందన్నారు. ప్రత్యామ్నాయ పంథాగా ఏది వుంటుందో దానిని గురించి చర్చించటం అవసరమన్నారు. 'నవజనవాది లోక్ మంచ్' రాష్ట్ర కార్యదర్శి ఆర్.కె.సింగ్ మాట్లాడుతూ సైద్ధాంతిక సమస్యలను పరిష్కరించుకోకుండా ఐక్యత సాధ్యంకాదన్నారు. సిపిఐ(ఎం-ఎల్) పిసిసి జార్ఖండ్ రాష్ట్ర కార్యదర్శి డి.సి. గోహాయ్ మాట్లాడుతూ ఇంతకుముందు ఇదే తరహా చర్చను తాము కూడా నిర్వహించామని కానీ అది ఫలవంతం కాలేదన్నారు. అయినప్పటికీ ఆ చర్చను కొనసాగించాల్సిన అవసరముందన్నారు. మతతత్వ ఫాశిజం యొక్క ప్రమాదానికి వ్యతిరేకంగా ఐక్యపోరాటాన్ని నిర్మించాల్సిన అవసరం మనందరిముందు వున్నదన్నారు. సిపిఐ(ఎం-ఎల్) రెడ్‌ఫ్లాగ్ జార్ఖండ్ రాష్ట్ర కార్యదర్శి వశిష్ట తివారి మాట్లాడుతూ పెరుగుతున్న సామ్రాజ్యవాద దాడులకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

ఎస్‌యుసిఐ(కమ్యూనిస్టు) జార్ఖండ్ రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ మన శత్రువులెవరో మిత్రులెవరో తేల్చుకోవలసి వుందన్నారు. అనేక సిపిఐ(ఎం-ఎల్) గ్రూపులు, దేశంలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తున్న బడా బూర్జువావర్గాన్ని పరిగణలోకి తీసుకోవటంలేదన్నారు. సిపిఐ(ఎం-ఎల్) కేంద్ర నాయకులలో ఒకరైన అరవిందకుమార్ సిన్హా మాట్లాడుతూ ఈ అవగాహన, తప్పుడు అభిప్రాయంపై ఆధారపడి ఏర్పాటు చేసుకొన్నదన్నారు. భారత బడా బూర్జువావర్గం సామ్రాజ్యవాదానికి దళారీగా వ్యవహరిస్తోందన్న సిపిఐ(ఎం-ఎల్) అవగాహనను వివరించారు. కనుక, దళారీ బూర్జువావర్గాన్ని సిపిఐ(ఎం-ఎల్) శత్రువర్గంగా పరిగణిస్తోందన్నారు. సిపిఐ(ఎం-ఎల్) నాయకులు కామ్రేడ్ సుబోధ్‌మిత్ర, శియాశరణ్ శర్మ, శంభు మహతొ వారి అభిప్రాయాలను ముందుంచారు. చర్చలో భాగస్వాములైనవారంతా, ఈ చర్చను కొనసాగించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. 2017 జూన్ 5న ఎస్‌యుసిఐ(కమ్యూనిస్టు) కార్యాలయంలో ఈ అంశంపై తదనంతర చర్చను కొనసాగించాలని నిర్ణయించారు.

2017 ఏప్రిల్ 23న రష్యా సోషలిస్టు విప్లవ శతవార్షికోత్సవాన్ని నిర్వహించారు. జార్ఖండ్‌లోని వివిధ ప్రాంతాల నుండి 150 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సంతాల్ పరగణా నుండి కా॥ బాబుధన్ నాయకత్వంలోని హూల్ జార్ఖండ్ క్రాంతి దళ్‌కు ప్రాతినిధ్యం వహించే 55 మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. జంషెడ్‌పూర్ కార్మిక కామ్రేడ్స్ కాశీనాధ్ ప్రజాపతి, శ్యాంకిషోర్‌లు ఉత్తేజకరంగా విప్లవ గీతాలాలపించారు. కా॥ శియా శరణ్ శర్మ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కామ్రేడ్స్ శంభు మహతొ, అరవిందకుమార్ సిన్హా, సుబోధ్‌మిత్ర ఈ సమావేశంలో ప్రసంగించారు. అక్టోబర్ విప్లవ శతవార్షికోత్సవం నిర్వహిస్తున్న జార్ఖండ్‌కున్న సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల సుదీర్ఘ సాంప్రదాయాన్ని గుర్తుచేశారు. విలువైన ప్రకృతి సంపద యొక్క గొప్ప కోశాగారంగా వున్న జార్ఖండ్ తీవ్రంగా సామ్రాజ్యవాద దోపిడీ దాడులను ఎదుర్కొంటోందన్నారు. మైదాన ప్రాంతాలలోని సాధారణ ప్రజానీకంలో వున్నవిధంగా కాకుండా, ఆదివాసీలలో వర్గ విభజన తక్కువగా వుండటం వలన, సాపేక్షంగా సామ్యవాదాన్ని ఆమోదించి, స్వీకరించటం తేలికగా వుంటుందన్నారు.

చారిత్రకంగా సామ్యవాదం ముగింపు దశకు చేరుకోవటాన్ని చూడాలనే తమ బలమైన కోర్కెను బూర్జువా మేధావులు వాస్తవికం చేసుకోజాలరని కా॥ అరవిందకుమార్ సిన్హా పేర్కొన్నారు. ఎప్పటికీ పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీ క్రింద జీవించటానికి ప్రపంచ ప్రజానీకం అంగీకరించబోరన్నారు. ఈనాడు తిరిగి సామ్రాజ్యవాదం పీకల లోతు సంక్షోభంలో చుట్టుముట్టబడి వుందన్నారు. ప్రపంచ ప్రజానీకం నుండి అది నిరంతరాయంగా వ్యతిరేకతను, పోరాటాన్ని ఎదుర్కొంటోందన్నారు. రష్యన్ సోషలిస్టు విప్లవ విజయాలను, ప్రాధాన్యతను ఆయన వివరించారు. కామ్రేడ్ సుబోధ్‌మిత్ర మాట్లాడుతూ రష్యాలో సోషలిస్టు విప్లవ అనంతర కాలంలో సామ్రాజ్యవాదులు మరియు రష్యా కమ్యూనిస్టు పార్టీలోనే అంతర్గతంగా వున్న సామ్రాజ్యవాదుల ఏజెంట్లు ఏవిధంగా కుట్రలు చేశారో; లెనిన్, స్టాలిన్‌ల నాయకత్వంలో రష్యన్ కమ్యూనిస్టుపార్టీ ఆ కుట్రలను ఏవిధంగా విఫలం చేసిందో వివరించారు. స్టాలిన్ మరణానంతరం కృశ్చేవ్ నాయకత్వంలో రష్యాలో పోరాటం తీవ్ర వెనుకపట్టుకు గురై, పెట్టుబడిదారీ పునరుద్ధరణ మార్గానికి మళ్ళించబడిందన్నారు. బోల్షివిక్ తరహా పార్టీ నిర్మాణమై, విప్లవానికి నాయకత్వం వహించటం వలనే రష్యాలో విప్లవం విజయవంత మైందని కా॥ శియాశరణ్ శర్మ పేర్కొన్నారు. భారత దేశంలో ఆ విధమైన పార్టీ నిర్మాణం జరగకుండా భారత విప్లవం విజయవంతం కాబోదని పేర్కొంటూ, అందుకు పూనిక వహించాలని పేర్కొంటూ ఆయన ఈ సభను ముగించారు.

ంంంం